క్లుప్తంగా

కల్వర్టు స్లాబ్‌కు మరమ్మతు



మరమ్మతు చేస్తున్న జీపీ సిబ్బంది

సాక్షి స్పందన

లోకేశ్వరం: మండలంలోని రాయాపూర్‌కాండ్లీ గ్రామంలో పోస్టాఫీసు కార్యాలయం గేటు వద్ద మురుగుకాల్వపై స్లాబ్ శిథిలావస్థలకు చేరి గుంత ఏర్పంది. వివిధ పని నిమిత్తం వచ్చి వెళ్లే ప్రజలు గుంతలో పడిపోతున్నారని 'గేటు వద్ద జరభద్రం'శీర్షికన ఈనెల 28న సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఎంపీవో సోమాన్‌రాజ్ ఆదేశాల మేరకు కార్యదర్శి నారాయణ సోమవారం పంచాయతీ సిబ్బందితో కల్వర్టుకు సిమెంట్ వేసి మరమ్మతు చేపట్టారు.

విద్యార్థులు పరిశుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న డా ఫిర్దోస్ జబీన్

భైంసాటౌన్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని యూపీహెచ్‌సీ వైద్యురాలు ఫిర్దోస్ జబీన్ అన్నారు. పట్టణంలోని మదీనాకాలనీలో గల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం బాలశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, తదితర అంశాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో కలీమోద్దీన్, హెల్త్ అసిస్టెంట్ నరేశ్, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షాల కోసం ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న వ్యాపారులు, తదితరులు

భైంసాటౌన్: వర్షాలు సమృద్ధిగా కురవాలని భైంసా సీడ్స్, పెస్టిసైడ్స్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక గాంధీగంజ్ నుంచి చెరువుకట్ట మహాదేవ్ మందిర్‌తోపాటు పట్టణంలోని పలు ఆలయాలకు భాజాభజంత్రీలతో చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో జలాభిషేక పూజలు నిర్వహించారు. వరుణుడు కరుణించి, వర్షాలు సమృద్ధిగా కురవాలని, రైతులు పాడిపంటలతో సుఖసంతోషాలతో ఉండాలని మొక్కుకున్నారు. అనంతరం గంజ్ ఆవరణలో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, కార్యదర్శి నాగేశ్, పీఆర్‌వో శివకుమార్, వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు ఉన్నారు.

'జాతీయ పార్టీలకు బీసీలపై చిన్నచూపు'

భైంసాటౌన్: జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ బీసీలపై చిన్నచూపు చూస్తున్నాయని బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త డా కిరణ్‌కుమార్ కొమ్రేవార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీ వర్గానికి చెందిన ఈటల రాజేందర్‌ను కాదని, ఓసీ వర్గానికి చెందిన రాంచందర్‌రావును ఎన్నుకోవడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. అంతేగాక, ఎల్‌పీ లీడర్‌గా సైతం మహేశ్వర్‌రెడ్డిని ఎన్నుకుని బీసీలపై చిన్నచూపు చాటుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సైతం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని, ఇప్పటికి చేయలేదన్నారు. ఈ రెండు పార్టీలకు బీసీలపై ఎలాంటి చిత్తశుద్ధి లేదని, బీఆర్‌ఎస్‌లో మాత్రమే బీసీ వర్గాలకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



నోట్‌బుక్స్ అందుకున్న విద్యార్థులు

కుంటాల: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని హెచ్‌ఎం చంద్రశేఖర్ రావు పేర్కొన్నారు. మండలంలోని కల్లూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన నోట్‌బుక్‌లను వీడీసీ సభ్యులతో కలిసి సోమవారం పంపిణీ చేశారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పునరావాసంలో సమస్యలు

- అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు లేవు
- వర్షానికి బురదమయం
- నిలిచి ఉన్న నీరుతో దోమలు వృద్ధి
- ఇబ్బందుల్లో ప్రజలు



టాక్లిలో కనిపించని డ్రెయినేజీలు



లింగా గ్రామంలో ప్రధాన రోడ్డు దుస్థితి

భైంసారూరల్: గడ్డెన్న వాగు ప్రాజెక్టులో సర్వం కోల్పోయిన బాధితులను కొత్త చోట ప్రభుత్వం పునరావాసం కల్పించింది. 2006లో ప్రాజెక్టు పనులు పూర్తయిపోయినా పునరావాస గ్రామాల్లో సమస్యలు ఇప్పటికీ తీరడం లేదు. ఏళ్లుగా సమస్యలతోనే స్థానికులు సాహవాసం చేస్తున్నారు. మండలంలోని టాక్లి, లింగా-1, లింగా-2, కుంబి గ్రామాల్లో నేటికి పూర్తిస్థాయిలో అంతర్గత రోడ్లు లేవు. వర్షం వస్తే నీరు రోడ్లపై నిలిచి ఉంటుంది. రోడ్లపై స్థానికులు నడవలేకపోతున్నారు. బురదమయమైన రోడ్లపై వాహనాలు ముందుకు వెళ్లడం లేదు. వర్షం కురిసి ఇళ్ల ముందే నీటి కుంటలా నీరు చేరి కనిపిస్తుంది. అలాగే డ్రెయినేజీలు లేక మురుగు నీరు రోడ్లపై నిల్వడంతో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. జనావాసాల మధ్యలో కంపు కొడుతున్న డ్రెయినేజీలతో స్థానికులు కాలం వెళ్లదీస్తున్నారు. వర్షాలు కురిస్తే పరిస్థితి అధ్వానంగా తయారయ్యేలా ఉంది. అధికారులు స్పందించకపోతే ఇబ్బందులు రెట్టింపుకానున్నాయి.

పాముల బెడద..

టాక్లి, కుంబి పాఠశాలల చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరిగి చిట్టడవిని తలపించే వాతావరణం కనిపిస్తుంది. పంట పొలాలకు ఆనుకుని పాఠశాల భవనాలు ఉండడంతో రోజు ఒకటి, రెండు పాములు కనిపిస్తున్నాయి. గడ్డెన్నవాగు ప్రాజెక్టులో నీరు నిల్వ ఉంచడంతో సమీపంలోని పునరావాస గ్రామాలైన లింగా-1, లింగా-2, టాక్లి గ్రామాల్లోనూ పాముల బెడద తప్పడం లేదు. రాత్రి వేళ టార్చ్‌లైటు లేనిదే కాలు బయటపెట్టలేని పరిస్థితి ఉంది. దీనికి తోడు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలు వెలగక జనం ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



మట్టి రోడ్లపై వర్షపు నీరు నిలిచి బురదమయంగా కనిపిస్తుంది. నడిచేందుకు ఇబ్బంది పడుతున్నాం. అధికారులు సమస్యను పరిష్కరించాలి.

– భోజారం, కుంబి

నీరు వెళ్లడం లేదు



రోడ్లకు ఇరువైపులా కాలువలు తవ్వారు. కాలువల్లో మట్టి పూడుకుపోవడంతో నీరు ముందుకు వెళ్లడం లేదు. కాలనీల్లో ఇళ్ల ముందు నీరు నిల్వడంతో దోమలు పెరిగి రోగాల బారిన పడుతున్నాం. మా గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు.

– గంగాధర్, టాక్లి

చర్యలు తీసుకుంటాం

దశలవారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. గ్రామానికి వెళ్లి అక్కడి సమస్యలను తెలుసుకుంటాం. ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. స్థానికంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

– సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో

మత్స్యకారులు చేపలవేటకు వెళ్లొద్దు



మత్స్యకారులకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ విశ్వంబర్, ఎస్సై సాయికృష్ణ

దస్తురాబాద్: మండలంలోని భూత్కూర్ పంచాయతీ రాంపూర్ సమీపంలో గోదావరి తీర ప్రాంతంలోని చింతమడుగులో మత్స్యకారులు చేపలవేటకు వెళ్లొద్దని తహసీల్దార్ విశ్వంబర్, ఎస్సై సాయికృష్ణ పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో రాంపూర్, దస్తురాబాద్ మత్స్యకార సంఘం నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గోదావరిలోని చింతమడుగు ప్రాంతంలో ఎవరూ చేపల వేటకు వెళ్లదన్నారు. 145 సెక్షన్ అమలు నిబంధనలు ఉల్లంఘించి చేపల వేటకు వెళ్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ యాదవ రావ్, ఆర్‌ఐలు రచన, ఆర్తి, గ్రామాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● బైక్ చోరీ

బాసర: బాసర రైల్వేస్టేషన్‌లో పార్కింగ్ చేసిన బైక్ చోరీకి గురైంది. బాసరకు చెందిన ఆలయ ఉద్యోగి శ్రీనివాస్ ఆదివారం ఉదయం రైల్వేస్టేషన్ ప్రాంగణంలో బైక్ పార్కింగ్ చేశాడు. రైలులో నిజామాబాద్ నుంచి బాసరకు వెళ్లాడు. మళ్లీ తిరుగుప్రయాణంలో బాసర రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. బైక్ కనిపించలేదు. రైల్వేస్టేషన్లో ఏర్పాటు చేసిన గుర్తుతెలియని వ్యక్తి బైక్‌ను తీసుకెళ్తున్నట్లు సీసీ ఫుటేజీలో రికార్డు అయ్యాయి. అనంతరం రైల్వేపోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దస్తురాబాద్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యుడు నాగరాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆరోగ్యకేంద్రంలో వైద్యసిబ్బంది, ఆశకార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ప్రతి ఇంటింటికి వెళ్లాలన్నారు. జ్వరంతో బాధపడేవారు, వాంతులు చేసుకునే వారిని గుర్తించి చికిత్స అందించాలన్నారు. హెచ్‌ఈవో ఎస్.కన్నయ్య, హెల్త్ సూపర్వైజర్ లలిత, వైద్యసిబ్బంది ఉన్నారు.

● చెరువు కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ గ్రామ ఊర చెరువు కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు నర్సయ్య, శేఖర్, శ్రీనివాస్, భీమన్న, రాజన్న, తదితరులు ఉన్నారు.

● జాతీయస్థాయి పోటీల్లో సత్తా

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అనుముల అమర్-లావణ్య దంపతుల కుమార్తె శ్రీ వైష్ణవి ఆదివారం గోవాలో జరిగిన అండర్-13 జాతీయ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సత్తా చాటారు. రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. బాలికల డబుల్స్ విభాగంలో ప్రతిభ కనబర్చడంతో బంగారు పతకం అందుకుంది.

● 'ఈ తహసీల్దార్ మాకొద్దు'

లోకేశ్వరం: పనిచేయని తహసీల్దార్ మాకొద్దని ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, ఆత్మ చైర్మన్ గన్ను నర్సారెడ్డి, కాంగ్రెస్ మండల కన్వీనర్ సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్, బీజేపీ నాయకుడు శంకర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఇటీవల బదిలీపై వచ్చిన తహసీల్దార్.. భూ సమసలపై, స్లాట్‌బుక్ చేసుకున్న వారు, వివిధ పని కోసం వచ్చేవారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఇక్కడ పని చేయకుంటే బదిలీపై వెళ్లిపోవాలన్నారు. ఈవిషయమై తహసీల్దార్ సర్ఫరాజ్ అమ్మద్ వివరణ కోరగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

● 'ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది'

నిర్మల్‌రూరల్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని డీఈవో రామారావు పేర్కొన్నారు. సోమవారం డీఈవో కార్యాలయంలో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ పరమేశ్వర్, సూపరింటెండెంట్లు వెంకటరమణ, శ్రావణి, ఎస్‌ఓలు సలోమి కరుణ, ప్రవీణ్ కుమార్, నరసయ్య, డీఎస్‌ఓ వినోద్ కుమార్, ఎంఈవో పాల్గొన్నారు.

● ఎంఈవో వీడ్కోలు సభ

ఖానాపూర్: మస్కాపూర్ గ్రామంలోని సీఎం రావు ఫంక్షన్‌హాల్‌లో ఎంఈవో ప్రేమ్‌సాగర్ పదవీ విరమణ వీడ్కోలు సభ సోమవారం ఘనంగా నిర్వహించారు. సత్తనపల్లి హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తూనే ఎంఈవోగా అందించిన సేవలను ఉపాధ్యాయ సంఘాల నాయకులు కొనియాడారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. అంతకుముందు విద్యార్థులు ఆయనకు పూలు చల్లి స్వాగతం పలికారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చిన్నం సత్యం, మాజీ వైస్ ఎంపీపీ తోట సత్యం, ఉపాధ్యాయ సంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మామడ: మామడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ పొందిన అడ్లూరి నర్సయ్యను ఉపాధ్యాయులు, గ్రామస్తులు సన్మానించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్న యాదవ్, పీఆర్టీయూ నాయకులు రాజన్న, మారెన్న, ఉపాధ్యాయులు సురేందర్‌రెడ్డి, శిల్ప పాల్గొన్నారు.

● శిశుమందిర్ పాఠశాల సందర్శన

ముధోల్: మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలను సోమవారం నిర్మల్ జిల్లా సరస్వతీ విద్యాపీఠం అధ్యక్షుడు నార్లపురి రవీందర్ సందర్శించారు. జిల్లా ఉపాధ్యక్షుడు సుదర్శన్, కార్యదర్శి పురస్తు గోపాల్ కిషన్‌లు పాల్గొన్నారు. పాఠశాల భవన నిర్మాణానికి రూ. 25 వేలు విరాళంగా అందించారు. పాఠశాల అధ్యక్షుడు సంజీవ్, ప్రధానాచార్యులు సారథి రాజు తదితరులు ఉన్నారు.

● పాఠశాలల పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

సోన్: పాఠశాలల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఎంఈవో తోడిశెట్టి పరమేశ్వర్ అన్నారు. మండలంలోని సాకెర తదితర పాఠశాల ఆవరణ, పరిసరాలు, టాయిలెట్లను సోమవారం పరిశీలించారు. బండరాళ్లు, చెత్తాచెదారం తొలగించాలని హెచ్‌ఎం, వీడీసీ సభ్యులకు సూచించారు. పాఠశాలల్లో పచ్చదనం, పరిశుభ్రత పాటించాలన్నారు. హెచ్‌ఎం లింగన్న ఉపాధ్యాయులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

● చిన్నారి నృత్య ప్రదర్శన

కడెం: మండల కేంద్రానికి చిన్నారి శ్రీవిద్య ఆదివారం తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తి నృత్య ప్రదర్శనలో పాల్గొంది. మండల కేంద్రానికి చెందిన దుంపేటి మౌనిక-సతీశ్ దంపతుల కూతురు శ్రీవిద్య స్థానిక ప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతుంది. భరతనాట్యం నేర్చుకుని తన ప్రదర్శనతో ఆకట్టుకుంటుంది.

ఉద్యాన పంటలపై దృష్టి సారించాలి



రైతుకు సూచనలిస్తున్న అధికారులు

కుంటాల: రైతులు ఉద్యాన పంటలపై దృష్టి సారించాలని భైంసా డివిజన్ ఉద్యానవన అధికారి జావిద్ పాషా సూచించారు. మండలంలో అందకూర్ గ్రామంలో ఆయిల్‌పామ్ సాగును సోమవారం పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. మామిడి, జామ, బొప్పాయి, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్‌తోపాటు తీగజాతి కూరగాయల కోసం శాశ్వత పందిళ్ల పథకం ద్వారా 50 శాతం రాయితీ ఉందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అందుబాటులో రాయితీపై డ్రిప్ పరికరాలు ఉన్నాయని పేర్కొన్నారు. కావల్సిన రైతులు సంప్రదించాలని కోరారు. రైతులు సాగర్ రావు, వెంకటేశ్వర్లు, నవీన్, క్లస్టర్ అధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన మున్సిపల్ సిబ్బంది



మొక్కలు నాటుతున్న మున్సిపల్ సిబ్బంది

భైంసాటౌన్: పట్టణంలోని నిర్మల్-భైంసా రహదారి వెంబడి మున్సిపల్ సిబ్బంది సోమవారం మొక్కలు నాటారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీస్, జవాన్లు, పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కోరారు.

విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యానికి బాలశక్తి

ఖానాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం బాలశక్తి కార్యక్రమాన్ని చేపట్టిందని మస్కాపూర్ జెడ్పీఎస్ఎస్ హెచ్‌ఎం నరేందర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్ సరస్వతి అన్నారు. మండలంలోని మస్కాపూర్ జెడ్పీఎస్ఎస్ విద్యార్థులకు సోమవారం బాలశక్తి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎంలు యోత్స్నా, రజిత, తదితరులు పాల్గొన్నారు.

సత్యం ట్రస్టుకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న చైర్మన్ రాపెల్లి సత్యం

కడెం: మండలంలోని నవబ్‌పేట్ గ్రామంలోని సత్యం ట్రెడిషనల్ ట్రస్టుకు పురస్కారం దక్కింది. ఆసియా వేదిక్ కల్చర్ అండ్ రీసెర్చ్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 29, 30న పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ నాంపల్లి ఆడిటోరియంలో వివిధ రంగాల్లో సేవలందించిన వారికి పురస్కారాలు అందజేశారు. చెన్నారెడ్డి, డా.శ్రీనివాస్‌ల చేతుల మీదుగా ట్రస్ట్ చైర్మన్ రాపెల్లి సత్యం 2025 సంవత్సరానికి గాను ఉత్తమ ట్రస్ట్ పురస్కారం అందుకున్నాడు.

సామాజిక కార్యక్రమాలు చేపట్టాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీ నారాయణను సన్మానిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌టౌన్: ప్రజల్లో చైతన్యం నింపేలా పాత్రికేయులు సామాజిక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిల పేర్కొన్నారు. నిర్మల్ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం కలెక్టర్, ఎస్పీలను మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని శాలువాలతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలు, పాలకులు, అధికారుల మధ్య పాత్రికేయులు వారధిగా ఉండాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు జిల్లా పౌరసంబంధాల అధికారి విష్ణును కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రాసం శ్రీధర్, ప్రధాన కార్యదర్శి బాస లక్ష్మీనారాయణ, కోశాధికారి సందీప్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన కలెక్టరేట్

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి అర్జీదారులు అధికసంఖ్యలో రాగా ప్రాంగణం కిటకిటలాడింది. ప్రజావాణిలో ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినా సమస్యలు పరిష్కారం కావడం లేదని పలువురు వాపోయారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



చివరి ఆయకట్టు వరకు సాగునీరందిస్తాం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

కడెం: సదర్మాట్, కడెం ఆయకట్టు రైతులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. కడెం ప్రాజెక్టు ఎడమ కాలువ, సదర్మాట్ కాలువ మరమ్మతు పనులను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. కాల్వల మరమ్మతు పూర్తిచేసి చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందిస్తామని పేర్కొన్నారు. ఇందులో ఏఎంసీ చైర్మన్ భూషణ్, ప్రాజెక్ట్ ఈఈ విఠల్, డీఈ నవీన్, పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశ్, జిల్లా నాయకుడు సతీశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జెండా గద్దె కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



జెండా గద్దెను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నిర్మల్‌టౌన్: బీఆర్ఎస్ జెండా గద్దెను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పార్టీ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము పేర్కొన్నారు. పట్టణంలోని వార్డు నంబర్ 7లో బీఆర్ఎస్ జెండా గద్దెను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి కూల్చివేశారు. సోమవారం పార్టీ నాయకులు ఆ స్థలాన్ని పరిశీలించి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్.. ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాయకులు డాక్టర్ సుభాష్ రావు, నజీరుద్దీన్ ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

లోకేశ్వరం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి భోజన్న అన్నారు. పుస్పూర్‌లో 44 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 11 లబ్ధిదారుల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ముధోల్ ఆత్మ చైర్మన్ నర్సారెడ్డి, మాజీ సర్పంచులు లింగాల పోతన్న, సంగెం నర్సన్న ఉన్నారు.

లక్ష్మణచాంద: బోరిగాం తండా, తిర్పెల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కాంగ్రెస్‌నేతలు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశ్వర్, తిర్పెల్లి గ్రామ అధ్యక్షుడు భీమేశ్ పాల్గొన్నారు. చామన్‌పెల్లిలో నాయకుడు అయిట్ల సుదర్శన్.. లబ్ధిదారులకు ప్రొసిడింగ్ కాపీలు అందజేశారు.

సారంగపూర్: తాండ్ర(జి)లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రొసీడింగ్ కాపీలను ఎంపీవో అజీజ్‌ఖాన్ అందజేశారు.

ముధోల్: స్థానిక జీపీ ఆవరణలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసిడింగ్ కాపీలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రావుల గంగారెడ్డి అందజేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ మాజీ సర్పంచ్ మహేందర్ అన్న చిన్నయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బుక్యా జాన్సన్‌నాయక్ సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు గజేందర్, ప్రదీప్, శ్రావణ్, సుమిత్, రవీందర్, నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ స్థలం పరిశీలన

ఖానాపూర్: పట్టణంలోని కొమురం భీం చౌరస్తాలోని ప్రభుత్వ స్థలాన్ని ఇంటిగ్రేటెడ్ స్కూల్ సాధన సమితి జేఏసీ నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ నంది రామయ్య మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించేందుకు స్థలం లేదని అధికారులు, నాయకులు ప్రజలకు అవాస్తవాలు చెప్పవద్దన్నారు. వాస్తవాలు నిరూపించడానికి ప్రభుత్వం ఇచ్చిన పత్రాలతోపాటు పూర్తి ఆధారాలతో నిరూపించడానికి జేఏసీ నాయకులు సిద్ధంగా ఉన్నామన్నారు. నాయకులు ఆకుల శ్రీనివాస్, కొండాడి గంగారావు, బీసీ రాజన్న, కాసవేణి ప్రణయ్, ఎనగందుల నారాయణ, ప్రదీప్, సుమిత్, రాజు, శ్రావన్, నరేందర్‌రెడ్డి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇసుక డంపుల వేలం

కడెం: మండలంలోని నర్సింగాపూర్, హరిజనవాడ, మండల రెవెన్యూ కార్యాలయంలోని ఇసుక డంపులకు మంగళవారం వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఆర్.ప్రభాకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ.5 వేల నగదు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.